క్లుప్తంగా

ప్రమాదాల నివారణపై శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం డ్రైవర్లకు కేఎంపీఎల్, ప్రమాదాల నివారణ అంశంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజరు రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ శిక్షణా తరగతులు ఈ నెల 30వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



పోతురాజు విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో ద్రౌపదీ సమేతధర్మరాజ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి అమ్మవార్ల విగ్రహాలకు పలు రకాల అభిషేకాలతో విశేష పూజలు నిర్వహించారు. పోతురాజు విగ్రహాన్ని పాతవీరాపురం, మాధవమాల, గుండరాయనిమిట్ట, ఇసుకతాగేలి, రేణిగుంట మండలంలోని మల్లవరం గ్రామాల్లో ఊరేగించారు. ఆయా గ్రామాల్లో భక్తులు పోతురాజుకు పూజలు చేశారు. శుక్రవారం రాత్రి శాస్త్రోక్తంగా సామి అమ్మవార్ల ధ్వజారోహణం నిర్వహించారు. ఉత్సవాలు ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, మాజీ జెడ్పీటీసీ మునిరంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, పూజారి రవి పాల్గొన్నారు.

బాలికలను జూనియర్ కాలేజీలో చేర్పించండి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో పదో తరగతి పాసైన విద్యార్థులను చేర్పించాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విజయకుమారి, అధ్యాపకులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం వారు కాటూరు, వీఎస్ పురం, పల్లమాల గ్రామాల్లో పర్యటించి, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, గ్రూపులను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. పదో తరగతి పాసైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కో గ్రూపునకు 40 సీట్లు ఉంటాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9703479970 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

బీజేపీ సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా ఆనంద్ సూచనలతో ఆ పార్టీ నాయకులు శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఆ పార్టీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశం కోసం, ధర్మం కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అందుకే దేశప్రజలు మరోసారి ఎన్డీయే కూటమికి ఓట్లు వేసి నరేంద్రమోదీని మూడవ సారి ప్రధానమంత్రిని చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎన్వీ రమణ, కొండేటి గోపాల్, ప్రజ్ఞశ్రీ, గోపాల్, కిరణ్‌మణి, కోనేటి అయ్యప్ప, ఢిల్లీకుమార్, వెంకట సుబ్బయ్య, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శుక్రవార ఉత్సవం



ఊరేగుతున్న అమ్మవారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పురస్కరించుకుని జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రైతుకు పోషకాల ఉ'సిరి'



ఉసిరితోట



ఉసిరి చెట్టు

పోషకాల సిరి ఉసిరి రైతులకు సిరులు కురిపిస్తోంది. ఒక్కసారి సాగు చేస్తే 40 ఏళ్ల పాటు దిగుబడి వస్తుంది. సాగు ఖర్చులు కూడా తక్కువే. పంట సాగుకు ప్రభుత్వం హెక్టారుకు రూ.18 వేల రాయితీ కూడా ఇస్తోంది. దీంతో మండలంలోని రైతులు ఉసిరి తోటలు సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు.

–విజయపురం

- రైతుకు అదనపు ఆదాయం
- ఒక్కసారి సాగుచేస్తే 40 ఏళ్ల వరకు దిగుబడి

పండించే పంట దిగుబడి లేదని, దిగుబడి బాగా వచ్చినా ధర పలకలేదని ఆందోళన చెందే రైతును ఉసిరి ఆదుకుంటోంది. ఏడాడికి రెండుసార్లు ఫలసాయాన్ని అందిస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఇస్తోంది. ఉసిరిలో ఎక్కువగా ఔషధ గుణాలు ఉండడం, రోగనిరోధక శక్తిని కలిగిస్తుండడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అందుకే ప్రతి ఒక్కరూ జీవిత కాలంలో ఐదు ఉసిరి మొక్కలయినా నాటాలని పూర్వీకులు చెబుతారు. శరీరంలో రోగ నిరోధకశక్తి పెరగాలంటే సి – విటమిన్ ఎక్కువగా ఉండే పండ్లూ, కూరగాయలూ తినాలి. కరోనా పుణ్యమా అని ఈ విషయం మాటలు సరిగ్గా రాని పసివాళ్ల నుంచి వృద్ధుల వరకూ తెలియడంతో ఉసిరి సాగుపై ఆసక్తి నెలకొంది. మండలంలోని విజయపురం, మిట్టూరు, శ్రీహరిపురం, కాకవేడు ప్రాంతాల్లోని రైతులు ఉసిరి పంటను సాగు చేస్తున్నారు. రెండు మండలాల్లో సుమారు 200 ఎకరాల్లో ఉసిరి సాగవుతోంది. రైతులు తమిళనాడులోని తంజావూరు నుంచి మొక్కలను తెచ్చుకుని నాటుకుంటున్నారు. ఒక్కసారి మొక్కలు నాటితే రెండేళ్లకు కాపు వస్తుంది. ఏడాదికి రెండుసార్లు ఫలసాయం అందుతోంది. ఎకరాకు 200 మొక్కలు నాటి సాగుచేసిన రైతులు చెట్టు పెరుగుదలను అనుసరించి ఎకరాకు రెండు నుంచి 5 టన్నుల వరకు దిగుబడిని పొందవచ్చు. ఉసిరి 30 నుంచి 40 ఏళ్ల వరకు ఫలసాయం అందుతుందని ఉద్యానవన అధికారులు తెలుపుతున్నారు. ఉసిరి చెట్టు నీటి ఎద్దడిని చాలా వరకు తట్టుకుంటుంది. చీడపీడలు, తెగులు ఎక్కువగా ఆశించవు. ఈ కారణంగా సాగు ఖర్చు తగ్గుతుంది. రాబడిలో ఖర్చు 10 శాతం మాత్రమే ఉంటుంది. డిమాండ్‌ను బట్టి టన్నుకు రూ.30 వేల నుంచి 50 వేలు వరకు ధర పలుకుతుంది.

మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు రవాణా

నగరి, విజయపురం మండలాల్లో సాగు చేసే ఉసిరి మన రాష్ట్రంలోని కర్నూలు, గుంటూరు, తెనాలితో పాటు తమిళనాడులోని చెన్నై, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో గల ఫ్యాక్టరీలకు ఎగుమతి అవుతోంది. ఉసిరితో మందులు, సిరప్‌లు, ఆయిల్, సోపు, ఊరగాయలు తయారు చేసి మార్కెట్లో విక్రయిస్తారు.



ఉసిరికాయలు

ఉసిరి సాగు లాభాలనిస్తోంది

నేను పదిహేనేళ్ల క్రితం నుంచి ఉసిరి సాగు చేస్తున్నాను. తమిళనాడులోని తంజావూరు నుంచి మొక్కలను తెచ్చుకున్నాను. ఏడాదికి రెండు సార్లు కాపు వస్తోంది. తెగుళ్లు, చీడపీడల సమస్య ఎక్కువగా ఉండదు. పంట మధ్య కలుపు పెరగకుండా చూసుకుంటూ, చెట్లను పరిశీలించి కొంతమేరకు తెగులు రాకుండా మందులు స్ప్రే చేసుకుంటే చాలు. మంచి దిగుబడి చూడవచ్చు. డిమాండ్‌ను అనుసరించి ఎకరాకు రూ.లక్ష వరకు లాభం వస్తుంది.

– జయరామయ్య, విజయపురం మండలం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో భాగంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఈఈ వాసురెడ్డి కోరారు.

సత్యవేడులో..

సత్యవేడు: దాసుకుప్పం, సత్యవేడు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా కట్ చేస్తున్నామన్నారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్‌తీగలపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయాన్ని గుర్తించి, సహకరించాలని అధికారులు కోరారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలకేంద్రంలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ చంద్ర నాయక్, ఏఈ జైసాయి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండల వ్యాప్తంగా విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు. సబ్ స్టేషన్ మరమ్మతు పనులు, లైన్లు మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

బయోఎంజైమ్ తయారీపై శిక్షణ

తిరుపతి కల్చరల్: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వేకాలనీలోని సరస్వతి శిశుమందిరంలో పండ్ల తొక్కలతో సంప్రదాయబద్ధంగా శుభ్రత కోసం ఇళ్లల్లో ఉపయోగించే బయోఎంజైమ్ తయారీపై మహిళలకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా అగ్రికల్చరల్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ కీర్తి వెంకయ్య ఈ కార్యక్రమానికి విచ్చేసి మాట్లాడారు. ఇంటిలో శుభ్రం చేసుకునేందుకు మార్కెట్‌లో దొరికే రసాయనిక పదార్థాలు హానికరమైనవి, ఇవి తాగునీటిని భూగర్భ జలాలను కలుషితం చేస్తాయని తెలిపారు. ఇది భూమి మీద నివశించే జీవరాశులకు, మానవాళికి ప్రమాదకరమని తెలిపారు. వాటికి ప్రత్యమ్నంగా సూక్ష్మజీవుల సహాయంతో తయారు చేసే బయో ఎంజైమ్ పర్యావరణానికి హానికరం కాదన్నారు. పర్యావరణానికి హాని చేయని బయో ఎంజైమ్‌ను వినియోగించడం శ్రేయష్కరమన్నారు. పండ్ల తొక్కలతో వాటిని ఎలా తయారు చేయాలని, మార్కెట్ ఎలా చేయాలని అంశాలపై మహిళలకు అవగాహన కల్పించడంతో పాటు వారికి శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో హేమంత్ కుమార్, శ్రీదేవి, ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ దత్తాత్రేయ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు: మహాత్మాజోతీరావ్‌పూలే ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలుర పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల15వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో https://mjpbcwres.apcfss.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. పాఠశాల పరిధిలో 59 సీట్లు ఖాళీ ఉన్నాయి. 6వ తరగతిలో 25, ఏడో తరగతిలో 12, ఎనిమిదో తరగతిలో 14, తొమ్మిదో తరగతిలో 8 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు.

ఎల్లమ్మకు భక్తి శ్రద్ధలతో పొంగళ్లు



రేణుకా యల్లమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

ఏర్పేడు: మండలంలోని కొత్తకండ్రిగలో శుక్రవారం శీతలాంబ దేవి, రేణుకా యల్లమ్మ ఆలయాల్లో పొంగళ్లు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలకు వివిధ రకాల అభిషేకాలతో పూజలు నిర్వహించి, అంబళ్లు పోశారు. మహిళలు ఆలయాల వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారి భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

రోగులకు బ్రెడ్, బిస్కెట్ల పంపిణీ



రోగులకు బ్రెడ్, బిస్కెట్లను పంపిణీ చేస్తున్న భాస్కర్ రెడ్డి, నాగరాజు,



పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్న నాయకులు

వరదయ్యపాళెం: సత్యవేడు అభివృద్ధికి మంత్రిగా, ఎంపీగా దాస్ సేవలు అభినందనీయమని బీజేపీ నాయకుడు భాస్కర్ రెడ్డి అన్నారు. దాస్ 103వ జయంతి సందర్భంగా మండలంలో పలు సేవా కార్యక్రమాలను పార్టీలకు అతీతంగా చేపట్టారు. ఈ సందర్భంగా చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద భాస్కర్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు సమాధి నాగరాజు ఆధ్వర్యంలో ఆస్పత్రి వైద్యాధికారి లావణ్య చేతుల మీదుగా రోగులకు బ్రెడ్, బిస్కెట్లను పంపిణీ చేశారు.

దేవాంగ సంఘం ఆధ్వర్యంలో..

వరదయ్యపాళెం బస్టాండ్ వద్ద రాష్ట్ర దేవాంగ సంఘం మీడియా కో–ఆర్డినేటర్ గుత్తి త్యాగరాజు, ఆటో మునిచంద్ర, చెంగయ్య ఆధ్వర్యంలో స్థానికులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. అలాగే వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారి ఉదయ్‌కుమార్ చేతుల మీదుగా బ్రెడ్, బిస్కెట్లు పంపిణీ చేశారు.

ప్రజలందరూ సంయమనం పాటించాలి

శ్రీకాళహస్తి: ప్రజలందరూ సంయమనం పాటించాలని డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల లెక్కింపు అనంతరం పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరిగాయన్నారు. అవి జరగకుండా అందరూ సంయమనం పాటించాలని చెప్పారు. అనవసర ఆవేశాలు, ఉద్వేగాలతో హింసకు పాల్పడకూడదని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల్లో జరిగిన ఘటనలను చూసి వర్గాల మధ్య చిచ్చు రేగే విధంగా ప్రవర్తించకూడదని సూచించారు. కోపతాపాలకు హింసాప్రవృత్తికి పాల్పడకూడదని స్పష్టం చేశారు. హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాంతియుత వాతావరణానికి సహకరించండి

వరదయ్యపాళెం: ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరూ స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలని, శాంతియుత వాతావరణానికి అందరూ సహకరించాలని శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు సూచించారు. శుక్రవారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో జరుగుతున్న పరిణామాలు చూసి ఏఒక్కరూ అల్లర్లకు కారకులు కావద్దని తెలిపారు. అనవసరంగా భావోద్వేగాలకు, హింసలకు పాల్పడవద్దని సూచించారు. గెలుపోటములు సహజమని, సంయమనంతో ముందుకెళ్లాలని సూచించారు. శాంతియుత పరిస్థితులతో ఏదైనా సాధించవచ్చని, కక్ష సాధింపులతో హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటాయని, అలాంటి ఆలోచనలకు స్వస్తి పలకాలన్నారు. ప్రశాంతంగా ఉండే ప్రాంతంలో రెచ్చగొట్టే చర్యలకు పాల్పడి, అనవసరపు అల్లర్లకు కారకులు కావొద్దని హితవు పలికారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎప్పటిలాగే ప్రజలందరూ సహకరించాలని కోరారు.



శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు

శ్రీశక్తిపీఠంలో ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్



రమణ ప్రసాద్, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం అందిస్తున్న అర్చకులు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తిపీఠంలో ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం పీఠంలో కొలువైన శ్రీవారాహీదేవికి, శ్రీమరకతశక్తి కాళీదేవి, శ్రీకూష్మాండదేవికి ప్రత్యేక పూజలు చేసి ముడుపులు సమర్పించారు. ఈ క్రమంలోనే శ్రీశక్తి పీఠం వ్యవస్థాపకుడు కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ రమ్యానంద భారతీ ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్ : పట్టణ పరిధిలోని చంద్రబాబు కాలనీ సమీపంలో శుక్రవారం రాత్రి కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు, పట్టణానికి చెందిన న్యాయవాది పసల చెంగయ్య భార్య వాణి, కుటుంబసభ్యులు లీలాకృష్ణ, కామాక్షి కల్యాణితో కలిసి కారులో నెల్లూరు వెళ్లారు. తిరిగి వస్తుండగా, సూళ్లూరుపేట వైపు నుంచి నెల్లూరు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో న్యాయవాది కారు వాగులో బోల్తా పడింది. కారులో ఉన్న న్యాయవాది భార్య వాణి, అత్తకు తీవ్ర గాయాలయ్యాయి. వారు స్థానిక ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను శుక్రవారం ఆలయ ఆవరణలో లెక్కించారు. ఆలయ ట్రస్టు చైర్మన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు పర్యవేక్షణలో లెక్కించారు. రూ.30,17,383 వచ్చినట్లు తెలిపారు. అమ్మవారికి భక్తులు అందించే కానుకల ద్వారా అబివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తామని ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, చేవూరు శ్రీనివాసులు, దువ్వూరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో ప్రతి కూలీకి పని కల్పించాలి

సత్యవేడు: ఉపాధి హామి పథకంలో ప్రతి కూలీకి పని కల్పించాలని సర్పంచ్ టి.జయ కోరారు. శుక్రవారం మండలంలోని కాళమనాయుడుపేట పంచాయతీ పరిధిలో రూ.9 లక్షలు మంజూరైన చెరువుకట్ట అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న ఉపాధి పనులను సర్పంచ్ పరిశీలించారు. పంచాయతీ పరిధిలో 100 మంది కూలీలకు తగ్గకుండా పని కల్పించాలని కోరారు. పంచాయతీ పరిధిలో కాళమనాయుడుపేట, దళితవాడ, గాంధీపురంలోని కూలీలలో ఎక్కువ మందికి పని కల్పించాలని ఏపీఓ కృష్ణయ్యను కోరారు. రెండు రోజులుగా వర్షాలు పడుతుండడంతో చెరువు కట్ట అభివృద్ధి పనులు చేపట్టారు. చెరువు కట్ట పటిష్టం చేయడంతో వర్షపునీరు చెరువులో నిల్వ ఉండే అవకాశం ఉంటుందన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ కే.సుమలత, ఫీల్డు అసిస్టెంట్ ఎస్.పాల్ దొరై పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు నీరు, నీడ, సౌకర్యాలతోపాటు, ప్రథమ చికిత్స బాక్స్ ఉండేలా చూడాలని జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన శుక్రవారం వీఎస్ పురం గ్రామంలోని ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ. 272 కూలీ వస్తుందని, రోజుకు 5 వేల మంది పని చేయాలని, కూలీల టార్గెట్ ప్రకారం తగ్గకుండా చూడాలని తెలిపారు. ప్రతి కూలీకి ప్రతిరోజు రూ.300 కూలీ గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో పండ్లతోటలు పెంపకం వైపు రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి నెలాఖరులోపు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ భానుప్రియ, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



వీఎస్‌పురంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్



సత్యవేడు: కాలమనాయిడుపేట చెరువులో జరుగుతున్న ఉపాధి పనులు

పొదుపు రుణాలను సక్రమంగా చెల్లించాలి



మహిళా సంఘ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న పీడీ ప్రభావతి

రామచంద్రాపురం: డ్వాక్రా మహిళలు పొదుపు రుణాలను సక్రమంగా చెల్లించాలని పీడీ ప్రభావతి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవనోపాధి రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. మహిళలు లాభదాయకమైన వ్యాపారాలు చేపట్టి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాధమ్మ, వెలుగు సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.